చెబితేనే.. చర్యలు తీసుకుంటారా?

అక్రమ నిర్మాణాలపై ప్రజలు ఫిర్యాదు చేస్తే తప్ప చర్యలు లేవా?

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అక్రమ నిర్మాణాలపై అనేక ఫిర్యాదులు

అక్రమ నిర్మాణాలపై పట్టించుకోకపోవడం వల్లే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు

మేడ్చల్, జనవరి7(నమస్తే తెలంగాణ): ''అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.. చర్యలు తీసుకోండి మహా ప్రభో!'' అంటూ అధికారులకు స్థానికులు, ప్రజలు విన్నవిస్తేనే కదులుతున్నట్టు సంకేతాలు రుజువు చేస్తున్నాయి. వారు విధి విధానాలకు అనుగుణంగా కదలడం లేదని స్థానికులు చెబుతున్నారు. 'ఎక్కడ ఎవ్వడేం చేస్తే మాకేంటి? మాకు అందాల్సిన మూట.. అందుతుంది' అన్న ధోరణి అధికారుల్లో ప్రస్ఫుటంగా అగుపిస్తున్నట్టు మేడ్చల్ జిల్లాలో ఆయా ప్రాంతాలలోని పలువురు చెబుకుంటున్నారు. అక్రమ నిర్మాణాలపై ప్రజలు ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు చర్యలు తీసుకోకపోవడం మూలంగా అధికారులపై ప్రజలకు పలు అనుమానాలు ఉద్భవిస్తున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ప్రభుత్వ, వివాదాస్పద భూములలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. జిల్లాలో ఉన్న మేడ్చల్, గుండ్ల పోచంపల్లి, తూకుంట, ఘట్‌కేసర్, పోచారం, దమ్మాయిగూడ, నాగారం, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలు ఉండగా నిజాంపేట్, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్లు ఉన్నాయి. అయితే, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో అనేకంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ విషయమై స్థానికులు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు చేసేందుకు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్లు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే జిల్లా కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదులు చేయాల్సి వస్తుందని తెలుపుతున్నారు. మున్సిపల్ కమిషనర్లపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం ఒ కారణంగా కనిపిస్తుంది.

జవహర్‌నగర్‌లో 975 ఎకరాలు కబ్జా..

జవహర్‌నగర్‌లో సుమారు 975 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కబ్జాలకు గురైన భూమి వందల కోట్లలో ఉంటుంది. అయినప్పటికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే ప్రభుత్వ భూమి కబ్జాలు చేసి కోట్లాది రూపాయలు దండుకున్నారు. నిరుపేదలు నిర్మించుకున్న వారిపై చర్యలు తీసుకోవడం తప్ప బడాబాబులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి

అక్రమ నిర్మాణాల కూల్చివేతలు - నమస్తే ఎఫెక్ట్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌లోని చెంగిచెర్లలో వివాదాస్పద భూములలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంపై అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. సర్వే నం. 34, 35, 36లలోని వివాదాస్పద భూములలో అక్రమ నిర్మాణాలను రాత్రికి రాత్రే నిర్మాణాలు చేస్తున్నట్లు వచ్చిన కథనంతో అధికారులు స్పందించారు. వివాదాస్పద భూములలో అధికార పార్టీకి చెందిన నేతలు అండ దండలు అందిస్తున్న క్రమంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. నమస్తేలో వచ్చిన కథనంతో నిర్మాణాలను కూల్చివేశారు.

బోడుప్పల్‌లో...

బొడుప్పల్ మున్సిపల్ పరిధిలో రామకృష్ణనగర్‌లో జనావాసల మధ్య కమర్షియల్ షెడ్లకు అనుమతులు లేకున్నా షెడ్లను నిర్మిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకున్నా నిర్మిస్తున్న షెడ్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రెసిడెన్సియల్ జోన్‌లో నిర్మిస్తున్న కమర్షియల్ షెడ్లను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుత్బుల్లాపూర్‌లో అక్రమ నిర్మాణాలు..

కుత్బుల్లాపూర్ 128 డివిజన్ చింతల్ భగత్‌సింగ్ నగర్‌లోని నాలా సమీపంలో సర్వే నం. 155లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టినా మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూమిలో ప్రజల ప్రయోజనాలకు అవసరమయ్యే విధంగా చూడాలని భగత్‌సింగ్ నగర్ ప్రజలు జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.

అబద్ధాలకు కేరాఫ్ కాంగ్రెస్ ప్రభుత్వం

మేడ్చల్ మల్కాగిజిరి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్ యాదవ్

'కామారెడ్డి బీసీ డిక్లరేషన్' హామీలు అమలు చేయాలని తహశీల్దార్ సుచరితకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జవహర్‌నగర్, జనవరి 7: అబద్ధాలకు కేరాఫ్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని, బీసీ డిక్లరేషన్ పేరుతో అందలమెక్కి బీసీలను నిలువునా మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు పుట్టగతులుండవని మేడ్చల్ మల్కాగిజిరి రూరల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్ యాదవ్ దుయ్యబట్టారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని మేడ్చల్ మల్కాగిజిరి జిల్లా రూరల్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం కాప్రా తహశీల్దార్ సుచరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ యాదవ్ మాట్లాడుతూ, ఏడాది పాలనలో ఎన్ని హామీలు అమలు చేశారని, అందుకు తగిన శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీలను కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయంగానే వాడుకుంటుందని, డిక్లరేషన్‌లో హామీలను అమలు చేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కమలాకర్, అశోక్ గౌడ్, భిక్షపతి, రాము నాయక్, సందీప్ ముదిరాజ్, యాదగిరి, జ్ఞానేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్, తాగునీరు సరఫరా నిలిపివేత

డీసీ వంశీకృష్ణ... నమస్తే తెలంగాణ కథనానికి స్పందన

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 7: వసంతనగర్ కాలనీలో నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేస్తున్న భవనాలకు కరెంట్, తాగునీటి సరఫరా నిలిపివేయాలని విద్యుత్, జల మండలి అధికారులను కోరినట్లు మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్ వంశీకృష్ణ తెలిపారు. నమస్తే తెలంగాణ దిన పత్రికలో 'అధికారులతో అండతో అడ్డగోలు నిర్మాణాలు...' అన్న శీర్షికన ప్రచురించిన కథనానికి మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్ వంశీకృష్ణ స్పందించారు. కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ వసంతనగర్ కాలనీలో ప్లాట్ నం. 520, 263, 213/ఏ, 710లలో జీహెచ్‌ఎంసీ నిబంధనలను అతిక్రమించి, జరుగుతున్న నిర్మాణాలు సీజ్ చేసినట్లు తెలిపారు. మరునాడే జీహెచ్‌ఎంసీ సీజ్‌ను తొలగించి, నిర్మాణ పనులు యధావిధిగా కొనసాగించారు. దీంతో ఆ నిర్మాణదారులపై కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, క్రిమినల్ కేసును నమోదు చేసినట్లు తెలిపారు. మరునాడే.. ప్లాట్ నం. 520, 263లలో నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు గుర్తించారన్నారు. జీహెచ్‌ఎంసీ నిబంధనల ప్రకారం, వసంతనగర్‌లో సీజ్ చేసిన భవనాలకు విద్యుత్, తాగునీటి సరఫరాను నిలిపివేయాలని ఆయా విభాగాల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే, కేపీహెచ్‌బీ కాలనీతో పాటు సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నగరంలో ఆల్ ఇండియా టీ20 టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ వేదికగా ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు 47వ ఆల్ ఇండియా రాజీవ్ గాంధీ టీ20 టోర్నీ జరుగనుంది. క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జరిగే టోర్నీలో 14 జట్లు పోటీ పడుతున్నాయి. ఇందులో శ్రీలంక, దుబాయ్, హైదరాబాద్, సీఎఫ్ఐ, బీహార్, విదర్భ, అండమాన్-నికోబార్, మలేషియా, తమిళనాడు, బెంగళూరు, కర్నాటక, తెలంగాణ, హర్యానా, మహారాష్ట్రలు ఉన్నాయి. అంబర్‌పేట వాటర్ వర్క్స్ గ్రౌండ్‌లో ఈ నెల 21న హైదరాబాద్, శ్రీలంక మధ్య తొలి మ్యాచ్ జరుగుంది.

ఓయూ టెన్నికాయిట్ టోర్నీ షురూ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఉస్మానియా విశ్వవిద్యాలయం అంతర కాలేజీ టెన్నికాయిట్ టోర్నీ మంగళవారం మొదలైంది. సరోజినీ నాయుడు వనితా ఫార్మసీ వేదికగా తొలి రోజు జరిగిన మహిళల పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ 21-17, 21-12తో సెయింట్ ఆన్స్‌పై, సరోజినీ నాయుడు కాలేజీ 21-14, 21-12తో సెయింట్ ఆన్స్(మల్లాపూర్)పై, సెయింట్ పాయిస్ 21-18, 15-21, 21-16తో కసూర్బా గాంధీపై గెలిచాయి. పురుషుల విభాగంలో అంబేద్కర్ కాలేజీ 21-16, 18-21, 21-15తో ప్రభుత్వ డిగ్రీ కాలేజీపై, సిటీ కాలేజీ 14-21, 21-15, 21-14తో బద్రుకా కాలేజీపై విజయం సాధించాయి.

9న మేడ్చల్‌లో జాబ్ మేళా

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 7: మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 9న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధికల్పన అధికారి రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, డీ-ఫార్మ, బీ-ఫార్మ, ఎం-ఫార్మ చదివిన అర్హత, ఆసక్తి గల యువకులు WWW.NIC.GOV.IN పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకొని హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 82476 56356, 73868 09422లలో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి శిల్పారామంలో 'గాంధీ శిల్ప బజార్, సంక్రాంతి సంబరాలు'

కొండాపూర్, జనవరి 7: మాదాపూర్‌లోని శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ (శిల్పారామం)లో బుధవారం నుంచి 'గాంధీ శిల్ప బజార్ నేషనల్, ఇంకా సంక్రాంతి సంబరాలు' ప్రారంభం కానున్నట్లు శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్ రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డెవలప్మెంట్ ఆఫ్ కమిషనర్ హ్యాండీక్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన హస్తకళాకారుల హస్తకళా ఉత్పత్తులు కొలువుదీరనున్నట్లు తెలిపారు. జనవరి 17వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగనుండగా, జనవరి 13వ తేదీ నుంచి సంక్రాంతి పర్వదినాలలో భాగంగా గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసులు, బుడబుక్కలు, జంగమదేవరులు, జానపద నృత్యాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. దీంతో పాటుగా ప్రతి రోజు సాయంత్రం ఆంఫీ థియేటర్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

ఉచిత కుట్టు మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, జనవరి 7(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. tgobmms. cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుకు ఈ నెల 20 వరకు అవకాశం ఉందని వివరించారు. క్రిస్టియన్ మైనార్టీ కమ్యూనిటీకి చెందిన నిరుద్యోగ మహిళలు, నిరుపేదలు, వితంతువులు, అనాథలు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తుదారుడి వయో పరిమితి 18-55 ఏండ్ల మధ్య ఉండాలని సూచించారు. అభ్యర్థి కచ్చితంగా ప్రభుత్వం గుర్తింపు పొందిన టైలరింగ్‌లో శిక్షణ పొంది ఉండాలని చెప్పారు.

ఏఐతో మరింత మెరుగైన ఆరోగ్య సేవలు

సిటీబ్యూరో, జనవరి 7(నమస్తే తెలంగాణ): భారతదేశంలోని అతి పెద్ద తృతీయ సంరక్షణ ఆసుపత్రులలో ఒక్కటైన, ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలో అగ్రగామిగా ఉన్న ఏఐజీ హాస్పిటల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ హెల్త్‌కేర్ 2.0 కాన్ఫరెన్స్‌ను మంగళవారం విజయవంతంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ఏఐ ఎంతటి మార్పులు తీసుకువస్తుందో అవగాహన కల్పించారు. ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. '' ఈ కాన్ఫరెన్స్ ద్వారా ఆరోగ్య సేవలను అందించే విధానంతో కృత్రిమ మేధస్సు ఎలాంటి విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందో..'' అనే దానిపై ప్రపంచానికి తెలియజేస్తామని అన్నారు. ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరుస్తామని చెప్పారు. ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ హాజరయ్యారు.

2047 నాటికి సాగులో యాంత్రీకరణే కీలకం

రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలి

భారతీయ అగ్రి పరిశోధనా డీజీఎం డా. ఝా

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 7: రానున్న కాలంలో సాగులో యాంత్రీకరణే కీలకమని, వ్యవసాయ యాంత్రీకరణకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (అగ్రికల్చర్ ఇంజనీరింగ్ భూపాల్) డా. ఎస్ఎన్ ఝా అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జాతీయ ఫార్మ్ ఇంప్లిమెంట్, మిషనరీ 39 వర్క్ షాపులో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2047 వికసిత్ భారత్ నాటికి, సాగులో 75 శాతం యాంత్రీకరణ సాధించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని ఆయన సూచించారు. వ్యవసాయ రంగం రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్నందున పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఇంజనీరింగ్‌కు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ కార్యదర్శి అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు ఇప్పటికే ఆదేశాలిచ్చారన్నారు. దేశంలో అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కళాశాలు ఏర్పాటు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అధునాతన టెక్నాలజీలను ఉపయోగించి నప్పుడు ఉత్పత్తి, ఉత్పాదకతలు అధికం అవుతాయన్నారు. యువత సాగు వైపు ఆకర్షితులు అవుతారని ఆయన అన్నారు. రానున్న కాలంలో తక్కువ మానవ ప్రమేయంతోనే సాగు చేసే పద్ధతులు రానున్నాయని వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య అన్నారు. పీజేటీఏయూ, అఖిల భారత వ్యవసాయ పనిముట్లు, యాంత్రీకరణ సమన్వయ పరిశోధన ప్రాజెక్టు (ఐకార్-సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, భూపాల్) మూడు రోజులు జరుగనున్నదన్నారు. పంటల సరళి, ఉత్పత్తి, ఉత్పాదకతలలో వివిధ మార్పులు వస్తున్నాయన్నారు. నాటి ట్రాక్టర్ నుంచి నేడు డ్రోన్‌లు, మొబైల్స్, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్, డిజిటలీకరణ విధానాలు సాగులో వస్తున్నాయన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో అధునాతన పనిముట్లు, యంత్రాల అవశ్యకత రోజురోజుకు పెరుగుతుందన్నారు. వ్యవసాయ విద్యలో అమ్మాయిల శాతం రోజురోజుకు పెరుగుతుందని, ఇది మంచిపరిణామన్నారు. ఈ సందర్భంగా పలు ప్రచురణలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐకార్ ఏడీజీ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ డా. కేపీ సింగ్, ఐకార్- సీఐఏఈ భూపాల్ డైరెక్టర్ సీఆర్ మెహతా, అకోలా, వర్సిటీ పూర్వ ఉప కులపతి డా. మైయాండే, భూపాల్ శాస్త్రవేత్తలు సావంత్, వర్సిటీ డీఆర్ రఘురామిరెడ్డి, డీన్ డా. జెల్లా సత్యనారాయణ, హెడ్ డా. రాజయ్య, విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు, బోధన, బోధనేతర సిబ్బంది, రైతులు, విద్యార్థులు పలు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

గొల్ల గట్టును రాష్ట్ర పండుగగా గుర్తించాలి

ఓయూలో పలు విద్యార్థి సంఘాల డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 7: వచ్చే నెలలో సూర్యాపేట జిల్లాలో వారం రోజుల పాటు జరుగబోతున్న గొల్ల గట్టు లింగమంతుల జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలని ఉస్మానియా యూనివర్సిటీలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశాయి. ఓయూ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ నెల 11న జరుగనున్న గొల్ల గట్టు సాంస్కృతిక చరిత్ర సదస్సు పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, జాతరకు పూర్తి కాల చైర్మన్, కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జాతర సమయంలోనే పరిమితమైన నిధులు కాకుండా అధిక నిధులు కేటాయించి, సంవత్సరం పొడుగునా మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గొల్ల గట్టు జాతరపై అగ్రవర్ణాలు చేస్తున్న కుట్రలను మానుకుని అక్కడ యాదవులు ఆశ్రిత కులాలైన బైకాని వారిని ప్రభుత్వం గుర్తించి, వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వట్టె జానయ్య యాదవ్, పిల్లి రామరాజు యాదవ్, లక్ష్మణ్ యాదవ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, కృష్ణ యాదవ్, బారి అశోక్ యాదవ్, కడారి రమేశ్ యాదవ్, నూకల మధు, కాయిత సతీశ్, నానబాల సంతోష్ యాదవ్, మహేశ్, శివశంకర్, సురేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గొల్ల గట్టు సాంస్కృతిక చరిత్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థి నాయకులు

బ్రహ్మ కుమారీలపై ఆరోపణల్లో వాస్తవం లేదు

- **వీడియోలు తొలగించాలని హైకోర్టు ఉత్తర్వులు**
- **శాంతి సరోవర్ డైరెక్టర్ కుల్‌దీప్ బెహన్**

సమావేశంలో మాట్లాడుతున్న శాంతి సరోవర్ డైరెక్టర్ కుల్‌దీప్, హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఈశ్వరయ్య, బ్రహ్మ కుమారీలు అంజలీ, రజనీ, అడ్వకేట్ జయకృష్ణ తదితరులు

శేరి లింగంపల్లి, జనవరి 7: బ్రహ్మ కుమారీస్ సంస్థపై సోషల్ మీడియా, యూ ట్యూబ్ వేదికగా వస్తున్న వార్తలు, ఆరోపణల్లో వాస్తవం లేదని తమ సంస్థ సనాతన ధర్మ సంరక్షణకు ఎల్లప్పుడు పాటుపడుతుందని గచ్చిబౌలిలోని ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శాంతి సరోవర్ డైరెక్టర్ కులదీప్ బెహన్ అన్నారు. గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బ్రహ్మ కుమారీస్‌పై వస్తున్న కథనాల్లో వాస్తవం లేదని, తప్పుడు ఆరోపణలతో తమపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. కేవలం ఏదో ఒక నెగటీవ్ న్యూస్‌తో ప్రజల్లో వైరల్ కావాలనే లక్ష్యంతో కొందరు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నెగటీవ్ వార్తలపై ప్రజలు అధిక ఆసక్తిని కనబరుస్తున్న ప్రస్తుత తరుణంలో, దానిని ఆసరాగా చేసుకొని కొందరు తప్పుడు సమాచారం, కథనాలు సోషల్ మీడియా వేదికగా వైరల్ చేస్తూ బ్రహ్మ కుమారీస్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని బాధ్యతాయుతంగా పాజిటీవ్ న్యూస్‌తో మనమందరం ముందుసాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది సభ్యులతో 140 దేశాల్లో బ్రహ్మ కుమారీస్ సంస్థ కార్యకలాపాలు సాగిస్తున్నదన్నారు. హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య, ప్రముఖ న్యాయవాది జయకృష్ణలు ఈ సందర్భంగా మాట్లాడుతూ, బ్రహ్మ కుమారీస్ సంస్థపై తప్పుడు కథనాలు, ఆరోపణలు, దుష్ప్రచారంపై ఈ నెల 6న హైకోర్టును ఆశ్రయించినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు హైకోర్టు సదరు వీడియోలను వెంటనే యూ ట్యూబ్, గూగుల్‌ల నుంచి తొలగించాలని ఆయా సంస్థలకు ఆదేశాలిస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్టు తెలిపారు. బ్రహ్మ కుమారీస్‌పై దుష్ప్రచారం చేస్తున్న కూకట్‌పల్లికి చెందిన యూ ట్యూబర్ లలిత్ కుమార్, మణికొండ ప్రాంతానికి చెందిన మహిళ వనితా మైథిలీలపై తెలంగాణలోని సైబరాబాద్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్, గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్లలో ఈ నెల 25న, ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతిలోని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో గత డిసెంబర్ 12న ఫిర్యాదులు చేశామని, వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయన్నారు. బ్రహ్మ కుమారీ ఉమారాణి, సరళ బెహన్‌లతో పాటు పలువురు బ్రహ్మ కుమారీస్ ప్రముఖులు, బ్రహ్మ కుమారీస్ సభ్యుల తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రేటర్‌లో తీవ్రత..

సిటీబ్యూరో, జనవరి 7(నమస్తే తెలంగాణ): ఈశాన్య దిశ నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో గ్రేటర్‌లో చలి తీవ్రత కొనసాగుతోంది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 29 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 11 నుంచి 15 డిగ్రీల వరకు, గాలిలో తేమ 42 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

ఉచిత కుట్టు మిషన్లకు దరఖాస్తులు

మేడ్చల్, జనవరి 7: రాష్ట్ర క్రైస్తవ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నేరుగా 'ఇందిరమ్మ మహిళా శక్తి' పథకం కింద శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను అందజేయనున్నట్టు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి వీణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు క్రైస్తవ మైనార్టీ మహిళలకు tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుకు గడువుగా నిర్ణయించినట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు తర్వాత హార్డ్ కాపీని అవసరమైన పత్రాలతో సంబంధిత జిల్లాలోని జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. క్రైస్తవ సామాజిక వర్గానికి చెందిన నిరుద్యోగ మహిళలు, నిరుపేదలు, వితంతువులు, విడాకులు పొందినవారు, అనాథలు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. రేషన్ కార్డు, రేషన్ కార్డు లేకుంటే ఆదాయ ధ్రువీకరణ పత్రం మాత్రమే సమర్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే, వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.2లక్షల వరకు ఉండాలన్నారు. దరఖాస్తుదారులు 18 నుంచి 55 ఏండ్ల లోపు ఉండాలన్నారు. నివాస రుజువుగా ఆధార్ కార్డు తప్పనిసరి అని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నం. 99851 45442, 94920 379 40లలో సంప్రదించాలని కోరారు.

ప్రపంచంలోనే అతి పెద్ద భద్రతా సంస్థగా పీఎఫ్

అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ శ్రీనివాస్

చర్లపల్లి, జనవరి 7: ప్రపంచంలోనే అతి పెద్ద సామాజిక భద్రతా సంస్థగా పీఎఫ్ పేరు గాంచిందని, కార్మికులు పీఎఫ్‌ను సద్వినియోగం చేసుకొవాలని అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి పారిశ్రామికవాడలోని సీఐఏ భవనంలో చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియా, గ్రాండ్ ఇండస్ట్రియల్ కాన్క్లేవ్ సంయుక్త ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు '2.0 చాలెంజస్, ఆపర్చ్యునిటీస్ వే ఎహెడ్' అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని పారిశ్రామికవాడలలో పనిచేస్తున్న కార్మికులు తప్పనిసరిగ్గా పీఎఫ్‌ను తీసుకోవాలని ఆయన సూచించారు. ఎనిమిది కోట్ల క్రీయాశీల కార్మికులకు సేవలందిస్తున్నదని, కార్మికుల నిధి మా వద్ద 25 లక్షల కోట్లు ఉందన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడ ఐలా చైర్మన్ రోషిరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోనే చర్లపల్లి పారిశ్రామికవాడ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందని, చర్లపల్లి పారిశ్రామికవాడలో 15 వందలకు పైగా చిన్న, మధ్య, సూక్ష్మ తరహా పరిశ్రమల